క్లుప్తంగా

ఒరిగిన స్తంభం.. విరిగితే ప్రమాదం



కొత్తూరు: మండల పరిధిలోని కొడిచర్ల గ్రామ శివారులో ఇన్ముల్‌నర్వకు వెళ్లే రోడ్డులో ఉన్న ఓ విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం పాఠశాలలకు చెందిన వాహనాలు, స్థానికులు రాకపోకలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈదురుగాలుల కారణంగా స్తంభం విరిగి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకముందే ట్రాన్స్‌కో అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎంపీలను కలిసిన షాద్‌నగర్ బీజేపీ నేతలు



డీకే అరుణకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కొత్తూరు: మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో భాగంగా షాద్‌నగర్, కొత్తూరుకు చెందిన బీజేపీ నాయకులు ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ఎంపీలు రఘునందన్‌రావు, డీకే అరుణ, బండి సంజయ్, ఈటల రాజేందర్‌లను కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు కొత్తూరు మండలానికి చెందిన బీజేపీ నేత నర్సింహాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకుడు అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు.

రామోజీరావుకు నివాళి



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, జర్నలిస్టులు

చేవెళ్ల: పలు రంగాల్లో వ్యాపారవేత్తగా, మీడియా సంస్థల వ్యవస్థాపకుడిగా సేవలు అందించిన రామోజీరావు మృతి తీరని లోటని చేవెళ్ల ప్రెస్‌క్లబ్ సభ్యులు, పలు పార్టీల నాయకులు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం చేవెళ్ల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రామోజీరావు మృతికి సంతాపం ప్రకటించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మీడియా, సినిమా రంగాల్లో ఆయన చూపించిన ప్రతిభ ఎల్లప్పుడూ గుర్తుండి పోతుందన్నారు. తెలుగు జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నిజాయితీని పెంపొందించారన్నారు. ఎంతో మంది హీరోలను, సినిమా నటులను, జర్నలిస్టులను తయారుచేసిన ఘనత ఆయనదేనన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ప్రెస్‌క్లబ్ సభ్యులు నాయకులు ఎంపీటీసీ రాములు, మహేందర్, వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జంగారెడ్డి మృతి

మొయినాబాద్‌రూరల్: అనారోగ్యంతో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఫిలిం బోర్డు సభ్యుడు నక్కలపల్లి గ్రామస్తుడైన బి.జంగారెడ్డి ఆదివారం ఉదయం మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా ఆయన కిడ్నీ సమస్యతో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఆయన మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని జిల్లాలోని ఆయా పార్టీల నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి నివాళులర్పించారు. ఆయన మృతిపై తోటి స్నేహితులు, అభిమానులు సంతాపం తెలిపారు.

అంతారం మాజీ సర్పంజ్ విఠలయ్యగౌడ్ మృతి

చేవెళ్ల: అంతారం గ్రామ మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్(72) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మండలంలోని అంతారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్ కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతికి మండలంలోని పలు పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు.

వానొస్తే రాకపోకలు బంద్



నందిగామ నుంచి నర్సప్పగూడకు వెళ్లే రహదారిలో బ్రిడ్జి లేక పొంగిపొర్లుతున్న వాగు(ఫైల్)



నందిగామ నుంచి వీర్లపల్లికి వెళ్లే దారిలో బ్రిడ్జి లేక ఇలా (ఫైల్)

- వాగు దాటాలంటే హడల్
- బ్రిడ్జి నిర్మాణాలు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

నందిగామ: వర్షాకాలం వచ్చిందంటే ఆ గ్రామాలకు వెళ్లాలంటేనే హడల్.. ప్రతీ ఏటా వరదల సమయంలో ఆ వాగుల వద్ద ఎన్నో ప్రమాదాలు జరుగుతుంటాయి. వాహనాలు సైతం వాగుల్లో కొట్టుకుపోయిన ఉదంతాలు ఉన్నాయి. అటుగా ప్రయాణించాలంటే వాహనదారుల గుండెల్లో గుబులు మొదలవుతోంది. అంతిరెడ్డిగూడ, నర్సప్పగూడ గ్రామాల మధ్యలో ఉన్న వాగు పొంగి పొర్లడంతో ఏటా ప్రమాదాలు జరుగుతుంటాయి. ఆ రోడ్లల్లోని వాగుల్లో బ్రిడ్జిలు లేకపోవడంతో పెద్ద ఎత్తున వాగు ప్రవహించిన సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి.

- మండల కేంద్రమైన నందిగామ నుంచి అంతిరెడ్డిగూడ మీదుగా నర్సప్పగూడ, చేగూరు గ్రామాలకు వెళ్లే దారిలో అంతిరెడ్డిగూడ, నర్సప్పగూడ గ్రామాల మధ్యలో ఉన్న వాగు పెద్ద ఎత్తున ప్రవహించినట్లయితే ఆ రోడ్డులో రాకపోకలు నిలిచిపోతాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు ఆ రోడ్డును మూసివేసి కాపలా ఉంటారు.
- మండల కేంద్రమైన నందిగామ నుంచి పిట్టిల్యా మినేషన్ పరిశ్రమ పక్క నుంచి వీర్లపల్లికి వెళ్లే దారిలో వాగు వచ్చిందంటే చాలు ఆ రోడ్డులో ఉన్న వాగు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయి.
- చంద్రాయాన్‌గూడ నుంచి అప్పారెడ్డిగూడకు వెళ్లే దారిలో ఓ పౌల్ట్రీఫాం సమీపంలో ఉన్న వాగు సైతం ప్రవహించినట్లయితే ఆ మార్గంలో కూడా రాకపోకలు నిలిచిపోతాయి. ఈ మార్గంలో గతంలో సింబాయాసిస్ యూనివర్సిటీకి వెళ్లే విద్యార్థులు వాగు దాటే క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు నీటి ప్రవాహంలో కొట్టుకుపోగా వారు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు.
- మండల కేంద్రం నుంచి వెళ్లే రహదారుల్లో రోడ్డు సక్రమంగా లేక, ఉన్న రోడ్లు గుంతలమయంగా కంకర తేలి ఉండగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నా ప్రస్తుత తరుణంలో కనీసం బ్రిడ్జీలు నిర్మించకపోవడంతో ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి రాకపోకలు నిలిచిపోతుండటం దారుణమైన పరిస్థితి. నందిగామ నుంచి నర్సప్పగూడ వరకు మంజూరైన రోడ్డులో కంకర పరిచి బీటి మరిచిపోయారు, అదే విధంగా నందిగామ నుంచి వీర్లపల్లికి వెళ్లే దారిలో గతంలో రోడ్డు నిర్మాణం చేపట్టి వాగు వద్ద అలాగే వదిలేయడంతో వాగు ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోయే దుస్థితి.

కొన్నేళ్లుగా..

భారీ వర్షం కురిసిన సమయంలో పెద్ద ఎత్తున వాగులు, వంకలు ప్రవహించడం సాధారణ విషయమే అయినా ఆ మార్గంలో బ్రిడ్జీలు నిర్మించలేకపోవడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బ్రిడ్జి నిర్మించాలి



పెద్ద ఎత్తున వాగు ప్రవహిస్తే మా గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో మండల కేంద్రానికి వెళ్లాలంటే చేగూరు రోడ్డు నుంచి తీగాపూర్ మీదుగా విజయలక్ష్మి చౌరస్తా నుంచి నందిగామకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మా గ్రామానికి రోడ్డు నిర్మాణంతో పాటు వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలి.

– కాట్న శేఖర్, మాజీ ఉపసర్పంచ్, నర్సప్పగూడ

ప్రతిపాదనలు పంపాం

మండల కేంద్రమైన నందిగామ నుంచి నర్సప్పగూడకు వెళ్లే రహదారిని రెండు వరుసలుగా నిర్మించి, బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాం. పంచాయతీ రాజ్ నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డుగా మార్చేందుకు కృషి చేస్తున్నాం.

– హేమంత్, ఏఈ పంచాయతీరాజ్

వార్షికోత్సవానికి ఆలయం ముస్తాబు

- రేపు పార్వతీపరమేశ్వరుల కల్యాణం
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

మొయినాబాద్‌రూరల్: ప్రతి ఏటా సోమేశ్వర ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ జంగం యాదవ్, ఆలయ కమిటీ పెద్దలు, మాజీ సర్పంచ్ ముదిగొండ రాజయ్యయాదవ్‌లు కృషి చేస్తున్నారు. అదే విధంగా ఈ సంవత్సరం 14వ వార్షికోత్సవాన్ని నిర్వహించేందుకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించాలమని పేర్కొన్నారు. 11వ తేదీ మంగళవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణంతో పాటు అభిషేకాలు, గణపతి హోమం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటలకు అభిషేకాలు, గణపతి హోమం ఉంటుందన్నారు. 11 గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరుగుతుందని, స్వామివారి కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. ఈ వార్షికోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు అందరూ పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.



ముస్తాబైన ఆలయం

ఉద్యమకారులను ఆదుకోవాలి

ఉద్యమకారుల ఫోరం జిల్లా వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ ఇబ్రహీం

షాబాద్: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ ఇబ్రహీం పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఉద్యమకారులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మేనిఫెస్టోలో పెట్టినట్లు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు గుర్తించేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేయాలని, అమరవీరుల కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉద్యమకారులు శివకుమార్, బాల్‌రాజ్, గౌసియాబేగం, రావుల లక్ష్మి, వినోద, చెన్నయ్య, మల్లేష్, మతీన్, గౌస్‌పాషా, తస్లీమ్, లక్ష్మయ్య, శివ, యాదయ్య, సత్తయ్య, తదితరులున్నారు.



నిరసన తెలుపుతున్న సయ్యద్ ఇబ్రహీం, తదితరులు

పేద విద్యార్థికి చేయూత

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కొండన్నగూడ గ్రామానికి చెందిన నాగి సాయిలు కుమారుడు సుభాష్‌చంద్ర సిద్దిపేటలోని ఆర్‌వీఎం కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. అతనిది నిరుపేద కుటుంబం కావడంతో విద్యార్థి సుభాష్‌చంద్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఈ విషయాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్స్ ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్దార్థ పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, వ్యాపారవేత్త నాగిళ్ల గోపాల్‌గుప్తాకు వివరించారు. వెంటనే స్పందించిన ఆయన తనవంతు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. పేద విద్యార్థి సుభాష్‌చంద్ర చదువుకు నాగిళ్లగోపాల్‌గుప్తా రూ.35వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సుభాష్‌చంద్ర, తండ్రి నాగి సాయిలు దాత నాగిళ్ల గోపాల్‌గుప్తాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



నగదు అందజేస్తున్న నాగిళ్ల గోపాల్‌గుప్తా

ప్రశాంతంగా గ్రూప్‌-1 పరీక్ష

మొయినాబాద్: గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మొయినాబాద్ మండలంలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష జరిగింది. గంట ముందు నుంచే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. 9 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 5,928 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 3,888 మంది పరీక్ష రాశారు. మొత్తం 65.58 శాతం పరీక్షకు అభ్యర్థులు హాజరైనట్లు మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్ రెడ్డిలు తమ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద సరైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో కార్లు, బైక్‌లపై వచ్చిన అభ్యర్థులు కాస్త ఇబ్బందిపడ్డారు. అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీఐఈటీ ఇంజినీరింగ్ కళాశాలలో గల రెండు కేంద్రాలను రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌తో కలిసి సందర్శించి పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో ఈసారి ప్రతి అభ్యర్థి బయోమెట్రిక్ వివరాలు నమోదు చేసినట్లు వివరించారు.



మొయినాబాద్‌లోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

నారాయణరావు మృతి బాధాకరం



శరత్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: పట్టణానికి చెందిన మాజీ పటేల్, పట్వారి నారాయణరావు అకాల మరణం బాధాకరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విచారం వ్యక్తం చేశారు. పట్టణంలోని న్యూసిటీ కాలనీకి చెందిన సీనియర్ పాత్రికేయుడు శరత్‌కుమార్ తండ్రి నారాయణరావు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పటేల్, పట్వారి వ్యవస్థలో మంచి అనుభవం కలిగిన నారాయణరావు ఆకస్మిక మృతి కలిచివేసిందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే తెలిపారు. నారాయణరావు మృతిపట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో మహ్మద్ అలీఖాన్‌బాబర్, కొంకళ్ల చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, జమృద్‌ఖాన్, సర్వర్ పాషా, నడికూడ యాదగిరి యాదవ్, శ్రీశైలంగౌడ్, ఖాదీర్, మంగ మధు, బాబ తదితరులు ఉన్నారు.

ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు



బోనాల ఊరేగింపు



హోమం నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్ బోకుల లింగం, తదితరులు

షాబాద్: మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠించి 41వ రోజులు పూర్తయిన సందర్భంగా బొడ్రాయి అమ్మవారికి బోనాలు, యజ్ఞహోమాలు వైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో దామర్లపల్లి మాజీ సర్పంచ్ బోకుల లింగం, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. వేద పండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో బోనాల ఊరేగింపు ఘనంగా కొనసాగింది. మహిళలు బోనాల ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దయాకర్‌చారి, కమ్మరి కృష్ణ, బాలు, మహేందర్, కృష్ణ, బల్వంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భద్రత కొరబడి

- కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలు
- ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభం
- విద్యార్థులను పంపించాలంటేనే జంకుతున్న తల్లిదండ్రులు



నెర్రెలుబారి శిథిలావస్థకు చేరిన పర్వతాపూర్ పాఠశాల భవనం



పెచ్చులూడి పడుతున్న రామచంద్రాపూర్ పాఠశాల భవనం

కొందుర్గు: మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడో ఏళ్ల కింద నిర్మించిన పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరినా, వాటిలోనే తరగతులు కొనసాగుతున్నాయి. వేసవి సెలవులు పూర్తికావడంతో ఈ నెల 12 నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. అయితే పాఠశాలల్లో సరైన వసతులు లేవు. చాలా గ్రామాల్లో పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. సరిపడా ఉపాధ్యాయులు లేరు. చదవడానికి పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందలేదు. ఇక చదువులు ఎలా సాగుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొందుర్గు మండలంలోని బైరంపల్లి, పర్వతాపూర్, లాలపేట పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపడి ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డిఘనాపూర్, పీర్జాపూర్, తూంపల్లి, ఎల్కగూడ పాఠశాల భవనాల పరిస్థితి అలాగే ఉంది. పై కప్పులు పెచ్చులూడి విద్యార్థులపై పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పిల్లలను పాఠశాలలకు పంపించాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు.


మండలంలో పాఠశాలలు ఇలా..

కొందుర్గు మండలంలో 23 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 2 ఉన్నత పాఠశాలలతోపాటు ఒక కేజీబీవీ, ఒక గురుకుల పాఠశాలలు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 28 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 4 ఉన్నత పాఠశాలలతోపాటు ఒక కేజీబీవీ, ఒక గురుకుల పాఠశాలలు ఉన్నాయి.

అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మరమ్మతులు

అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ పథకం ద్వారా ప్రతి పాఠశాలకు లక్ష రూపాయలు కేటాయించి పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం, వాటర్ సౌకర్యం, మూత్రశాలలు, మరుగుదొడ్ల, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని అంటున్నారు. ఇందులో భాగంగా మొదటి వడతగా కొందుర్గులో 11 పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయని ఎంఈఓ కిష్టారెడ్డి తెలిపారు. అయితే శ్రీరంగాపూర్, చిన్న ఎల్కిచర్ల, మహదేవ్‌పూర్ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా పనులు ప్రారంభించారు. జిల్లేడ్ చౌదరిగూడలో 17 పాఠశాలలు మంజూరు కాగా గాలిగూడ, తూంపల్లి, లచ్చంపేట పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా పనులు ప్రారంభించారు. మిగతా పాఠశాలల ఖాతాల్లో రూ.25 వేలు జమచేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోగా అన్ని పాఠశాలల్లో పనులు పూర్తిచేస్తామని ఆయన వివరించారు.


పూర్తిగా శిథిలమైంది



పర్వతాపూర్, రామచంద్రాపూర్ పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలమయ్యాయి. ఎప్పుడు కూలిపడి విద్యార్థులకు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని భయంగా ఉంది. ఈ విషయమై ఇదివరకే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అప్పటి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చాం. అయినా ఫలితం దక్కలేదు. ఇప్పుడైనా భవనాలు బాగుచేస్తే మంచిది.

– మంజుల, ఎంపీటీసీ, పర్వతాపూర్

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుంది. ఇప్పటికే 40 శాతం పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు సరఫరా చేశాం. ఒక్కో జత యూనిఫాం సిద్ధంగా ఉన్నాయి. ఈ ఏడాది విద్యార్థుల చదువులు సాఫీగా సాగేలా చూస్తాం

–కిష్టారెడ్డి, ఎంఈఓ